సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వాడవాడలా సేవా కార్యక్రమాలు చేపట్టి తమ అభిమానం చాటుకున్నారు. జననేతగా.. జనం మెచ్చిన ముఖ్యమంత్రిగా ప్రజలకు, రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను, సంక్షేమ పాలనను కొనియాడారు. పార్టీ శ్రేణులు, మహిళలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని జగనన్నే మళ్లీ సీఎంగా రావాలని.. ప్రజలకు అండగా నిలవాలని నినదించారు.



15వ వార్డులో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నడింపల్లి కృష్ణంరాజు



11వ వార్డులో కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ తదితరులు



12వ వార్డులో పేదలకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జనం మెచ్చిన నేత జగన్



20వ వార్డులో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, సురేష్

- రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జగనన్న జన్మదిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు
- 'తూర్పు'లో వాడవాడలా సేవా కార్యక్రమాలు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల మధ్య ఆయన పార్టీ రంగులతో కూడిన కేక్ కట్‌చేశారు. పార్టీకి మళ్లీ పూర్వవైభవం రానుందని, ప్రస్తుతం కూటమి పాలనలో ప్రజలు విసిగిపోతున్నారని శ్రీనివాస్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.మోహనరావు, ఒ.చిన్నారావు, కె.అప్పారావు, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో అన్నదానం

అమ్మానాన్న సొసైటీ ఆధ్వర్యంలో 12వ వార్డులో నిర్వహిస్తున్న జీవీఎంసీ నైట్ షెల్టర్‌లోని పేదలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నదానం చేశారు. షెల్టర్‌లో పేదల మధ్య కేక్ కట్‌చేశారు. పార్టీ నాయకులు రామన్, మోహన్, జ్యోతి ప్రకాష్, సంతోష్, వరహాలు, ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలు, నిరాశ్రయులకు వితరణ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్‌చేసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలు, వృద్ధులకు, రెడ్‌క్రాస్ హోమ్‌లోని నిరాశ్రయులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అందించిన సంక్షేమ పాలన చిరస్మరణీయమన్నారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలికిల నీలరెడ్డి, పిండింట్ల శంకర్‌రెడ్డి, నండూరి సుబ్రహ్మణ్యం, మాదు మంగరాజు, రామారావు, లక్ష్మణరావు, సీతారాం, ప్రేమ్ కుమార్, సత్యవతి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



22వ వార్డులో కేక్ కట్‌చేస్తున్న పీతల గోవింద్

అంధ విద్యార్థుల చదువుకు సాయం

18వ వార్డులో స్థానిక అంధ పాఠశాల విద్యార్థులతో కలిసి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కేక్ కట్‌చేశారు. అంధ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయడంతోపాటు వారి చదువు కోసం రూ.5 వేలు నగదును చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పేర్ల విజయచందర్, నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, ఉమ్మడి కల్యాణ్ మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాల ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణమూర్తి, మారుపల్లి పరదేశి, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



18వ వార్డులో అంధ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పార్టీ నాయకులు

వృద్ధులు, పిల్లలకు వితరణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైఎస్ జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వృద్ధులు, పిల్లలకు పండ్లు, రొట్టెలు, కూల్ డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వార్డు ఎస్సీ సెల్ నాయకులు కణితి మరియదాస్, గొలగాని కన్నారావు, మారడబుడి వేలంగాని, అనకాపల్లి రాజేష్ భాస్కర్, పెదిరెడ్ల నూకరాజు, మహిళా నాయకురాలు అనకాపల్లి రమణమ్మ, పార్టీ వార్డు నాయకులు పాల్గొన్నారు.



17వ వార్డులో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

22వ వార్డులో సంబరాలు

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో వార్డులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి కార్యకర్తలకు అందించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనను కొనియాడుతూ సంబరాలు జరిపారు.

అనాథాశ్రమ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

వైఎస్సార్‌సీపీ 20వ వార్డు అధ్యక్షుడు మువ్వల సురేష్ ఆధ్వర్యంలో జాలరిపేట వాల్తేరు డిపో వద్ద ఉన్న అనాథాశ్రమంలోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ పాల్గొని పుస్తకాలను అందజేశారు. అనంతరం కేక్ కట్‌చేసి విద్యార్థులతో సంబరాలు జరుపుకున్నారు.

భారీ రక్తదాన శిబిరం



బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసి ఈ శిబిరాన్ని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. శిబిరంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌తోపాటు 100 మందికి పైగా కార్యకర్తలు, స్థానికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, తూర్పు ఎన్నికల పరిశీలకుడు ముళ్ల అప్పారావు, 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, పార్టీ 20వ వార్డు అధ్యక్షుడు మువ్వల సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'మహాభారత కథా యజ్ఞం' ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో శనివారం మహాభారత కథా యజ్ఞం కార్యక్రమం ప్రారంభమైంది. అయోధ్య రామతీర్థ ట్రస్ట్ కోశాధికారి, ప్రసిద్ధ గురువు గోవింద్ దేవగిరి మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహాభారతంలో పాండవులు కౌరవుల జననం, బాల్యం, వివాదాలు, వివాహం, యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు, మహాభారత యుద్ధంలో విభిన్న పరిస్థితులు, కృష్ణ భగవాన్ లీలలు, భగవద్గీత ప్రవచనాల ద్వారా భక్తులకు వివరించారు. ఈ నెల 27 వరకు ప్రవచనాల కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. బీచ్ రోడ్డులోని వైఎంసీఏ నుంచి గాదిరాజు ప్యాలెస్ వరకు భక్తులచే నిర్వహించ తలపెట్టిన కలశ యాత్ర వర్షం కారణంగా రద్దయినట్లు వెల్లడించారు.

ఏయూ ఆర్చరీ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో విజయమోహన్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పురుషులు, మహిళల ఆర్చరీ జట్ల ఎంపిక కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీలు భువనేశ్వర్‌లోని కిట్స్ యూనివర్సిటీలో ఈ నెల 24 నుంచి 27 వరకు జరుగుతాయన్నారు. ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ అంశాల్లో యూనివర్సిటీ క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. పురుషుల విభాగంలో నలుగురు, మహిళల విభాగంలో ఇద్దరు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఆర్చరీ జట్టు కోచ్ గాయత్రి కళాశాల పీడీ కిశోర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సాహిత్య రచనలో అభిషేక్‌కు గుర్తింపు



ఆచార్య నరసింహారావుతో డాక్టర్ అభిషేక్

విశాఖ విద్య: డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ సాహిత్యానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందుకున్నారు. దీనిని శనివారం ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ డాక్టర్ అభిషేక్ రచనలను కొనియాడారు. ఆయన పుస్తకం ప్రజలను ఏకం చేయడానికి, భాష, సాహిత్యానికి ఉన్న శక్తిని గుర్తు చేస్తుందన్నారు. డాక్టర్ అభిషేక్ మాట్లాడుతూ తన ప్రయాణంలో స్ఫూర్తినింపిన ఛాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు మార్గదర్శకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్యానంపై అవగాహన

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్‌ఈ) ప్రాంగణంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. హార్ట్ ఫుల్‌నెస్ సేవా సంస్థ వలంటీర్లు పి.గాయత్రి, కె.లలిత బీఈడీ విద్యార్థులకు నిత్య జీవితంలో మెడిటేషన్ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ మెడిటేషన్ విద్యార్థుల్లో కలిగే మానసిక, శారీరక ఒత్తిళ్లను దూరం చేయడంలో ధ్యానం బాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'అయనాంతం' ఎఫెక్ట్‌తో అలుముకున్న చీకట్లు

ఏయూక్యాంపస్: శీతాకాలపు అయనాంతం నేపథ్యంలో పగలు తక్కువగా.. రాత్రి ఎక్కువగా ఉండే రోజు శనివారం(డిసెంబర్ 21) వచ్చింది. వేసవిలో ఒకసారి, చలికాలంలో ఒకసారి అయనాంతం వస్తుంది. శీతాకాల అయనాంతంలో తక్కువగా పగలు సమయం .. ఎక్కువగా రాత్రి సమయం ఉంటుంది. దీని ప్రభావం విశాఖ నగరంలో కూడా కనిపించింది. సాయంత్రం అవకుండానే నగరంలోని పలు ప్రాంతాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. ప్రధానంగా బీచ్ రోడ్డు, సిరిపురం కూడలి వద్ద మధ్యాహ్నం నుంచి వెలుతురు తగ్గిపోయింది. ఇది ప్రతీ ఏడాది జరిగే సాధారణ విషయమేనని నిపుణులు చెబుతున్నారు.



చీకటిమయంగా బీచ్ రోడ్డు (ఇన్‌సెట్‌లో) సిరిపురం కూడలిలో కమ్ముకున్న చీకటి

జాబ్‌మేళాలో 478 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల యాజమాన్యం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 478 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా డ్రైవ్‌కు వివిధ ప్రభుత్వ కళాశాలల నుంచి 1,675 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో టాటా గ్రూప్‌నకు 158 మంది, హోండా కంపెనీకి 81 మంది, ఫాక్స్‌కాన్ కంపెనీకి 120 మంది, అపోలో ఫార్మసీకి 15 మంది, అరబిందో ఫార్మాకు 16 మంది, ఫ్లిప్‌కార్ట్‌కు 18 మంది, యంగ్ ఇండియాకు 15 మంది, ఎస్‌బీఐ కార్డ్‌కు ఐదుగురు, ఏఆర్‌కే సొల్యూషన్స్‌కు ఆరుగురు, సాఫ్ట్ సొల్యూషన్స్‌కు 8 మంది, అభిరామ్ ఐటీ సొల్యూషన్స్‌కు 36 మంది చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, సూర్య ఇన్ఫోటెక్ సీఈవో సూర్య తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

దైవత్వం వైపు అందరూ పయనించాలి

విశాఖ విద్య: దైవత్వం వైపు ప్రతి ఒక్కరూ పయనించాలని ప్రవచకురాలు, స్వామి పార్థసారథి శిష్యురాలు సుశీలాజీ అన్నారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతియోగం' మీద ఆంగ్లంలో జ్ఞాన యజ్ఞం(ప్రవచనాలు) కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతోంది. నాలుగో రోజు శనివారం సుశీలాజీ ప్రవచిస్తూ ఆధ్యాత్మికంగా తక్కువ పరిణితి చెందిన వ్యక్తులకు, భగవంతుని అనుభూతిని పొందాలంటే నయాగరా జలపాతం లేదా హిమాలయ పర్వతాలు లాంటి పెద్ద ఆశ్చర్యకర విషయాలు కావాలన్నారు. ఎక్కువ పరిణితి చెందిన వ్యక్తులకు, అరటి పండు తొక్క వలిచినప్పుడు కుడా భగవంతుని అనుభూతిని పొందుతారని చెప్పారు. ఈ విషయం తెలిసిన శ్రీకృష్ణుడు తన అంతులేని వివిధ రూపాల గురించి వివరించి మానవాళి దృష్టిని దైవత్వం వైపు మరలచ్చడానికి ఈ అధ్యాయం ద్వారా ప్రయత్నించారని సుశీలాజీ పేర్కొన్నారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. స్వామీ పార్థసారథి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలను ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు పలువురు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో వేదాంత ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో నగరవాసులు పాల్గొన్నారు.




ప్రవచిస్తున్న సుశీలాజీ

ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు

ఎంవీపీకాలనీ: దేశంలోని ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు మరింత చేరువ కావాల్సిన అవసరముందని అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బోర్డ్ అక్రిడేటెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మిను బాజ్‌పాయి పేర్కొన్నారు. ఎంవీపీ దరి ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన డీఎన్‌బీ వైద్యుల అసోసియేషన్ 6వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుల సమావేశంలో బాజ్‌పాయి మాట్లాడుతూ దేశంలో రోగులకు, వైద్యులకు మధ్య నిష్పత్తి భారీగా ఉందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృత కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా దేశంలోని ప్రతి జిల్లాలో వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చేలా పనిచేస్తోందని తెలిపారు. తమ బోర్డు నూరు పడకల ఆస్పత్రుల్లో డీఎన్‌బీ కోర్సుల అనుమతి సులభతరం చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ బోర్డ్ ఆధ్వర్యంలో వైద్య కోర్సుల సీట్లు సంఖ్య భారీగా పెంచినట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య విద్యలో అత్యుత్తమ బోధన విధానాలు పాటిస్తూ వైద్యులను అభినందించారు. కొత్త ఆవిష్కరణల ద్వారా దేశానికి అత్యుత్తమ డాక్టర్లను అందించాలని సూచించారు. డీఎన్‌బీ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిరుమల ప్రసాద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ లింగయ్య మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా నిర్వహిస్తున్న సెమినార్లు, వర్క్‌షాప్‌లు, వైద్య సేవలను వివరించారు. అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఖుబ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

వెండి మబ్బుల కనువిందు



మూడు రోజుల పాటు వర్షాలు, చలిగాలులతో వణికించిన వరుణుడు శనివారం చల్లబడ్డాడు. సాయంత్రం నుంచి వానదేవుడు వీడ్కోలు పలకగా.. ఆ ఆనందంతో ఆకాశం కొత్త అందాలద్దుకుంది. నల్లని ఆకాశాన్నే కాన్వాస్ చేసుకుని వన్నెలద్దుకున్న వెండి మబ్బులు విశాఖ వాసుల్ని కనువిందు చేశాయి.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రహరీ పునర్నిర్మాణంలో జాప్యం



రెండు నెలల కిందట వర్షాలకు కూలిన ప్రభుత్వ బాలుర వసతి గృహం ప్రహరీ



కూలిన రక్షణ గోడను పరిశీలిస్తున్న జోన్-2 కమిషనర్, అధికారులు(ఫైల్)

- రెండు నెలల కిందట కూలిన బాలుర వసతి గృహం రక్షణ గోడ
- పట్టించుకోకుండా వదిలేసిన అధికారులు

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో రెండు నెలల కిందట కూలిపోయిన ప్రభుత్వ బాలుర వసతి గృహం రక్షణ గోడను అధికారులు నిర్మించకుండా వదిలేశారు. అత్యవసరంగా నిర్మించాల్సిన ఈ గోడ కూలిపోయినా అధికారులు పట్టించుకోకుండా వదిలేయం విశేషం. దీంతో ఇక్కడ బాలురు బయటకు వెళ్లపోవడానికి మార్గం ఏర్పడినట్లయింది. భవనం నుంచి ప్రాంగణంలోకి బాలురు వెళ్లకుండా కట్టడి చేయడానికి గృహం సిబ్బందికి సమస్యగా మారింది.

హామీ ఇచ్చారు.. ఆపై మరిచారు

రెండు నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు ఈ గృహం ప్రహరీ సగ భాగం కంటే ఎక్కువగా కూలిపోయింది. అప్పట్లో జీవీఎంసీ జోన్-2 అధికారులు ఆఘమేఘాలపై వచ్చి కూలిన గోడను పరిశీలించారు. అక్కడ రక్షణ గోడ వెంటనే నిర్మించాలని హడావుడి చేశారు. ఈ విషయం జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని గృహం అధికారులకు హామీ ఇచ్చారు. దాన్ని అంతటితో ఆపేసి విషయాన్ని మరిచిపోయారు. ఇంతవరకు ఈ గోడ గురించి పట్టించుకోలేదు. దీంతో ఆ భాగం ఖాళీ అయింది. ఈ గృహంలో పలు జిల్లాలకు చెందిన వీధి బాలురతోపాటు ప్రత్యేక గృహం(చేసిన తప్పు నిరూపణై శిక్ష అనుభవిస్తున్న బాలురు) కూడా నిర్వహిస్తున్నారు. బాలుర సంరక్షణలో భాగంగా ఈ గృహం చుట్టూ పటిష్టమైన రక్షణ గోడ తప్పనిసరి. అలాంటి రక్షణ గోడ కూలి రెండు నెలలు దాటినా.. సంబంధిత అధికారులు పట్టించుకోలేదని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. తక్షణం ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా అందించే సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేసేలా డిజిటలైజేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బ్యాంకు సీఈవో డీవీఎస్.వర్మ అన్నారు.బ్యాంకులు, సహకార సంఘాల సేవలన్నీ కంప్యూటరీకరణ చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విశాఖలోని మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీఈవో వర్మ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు నియయ నిబంధనలకు అనుగుణంగా డీసీసీబీ సేవలన్నీ ఇక నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చేలా యుద్ధప్రాతిపదికన అంతా సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే రికార్డులన్నీ కంప్యూటీకరణ చేయటం జరిగిందని, వీటిని మరోసారి క్రోడీకరించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు మేలు చేకూర్చాలనే లక్ష్యంతో సేవలు మరింత పారదర్శకంగా అందించాలన్నారు. శిక్షణ సంస్థ నుంచి హాజరైన నాగరాజు రికార్డుల కంప్యూటరీకరణలో తలెత్తే సాంకేతిక సమస్యలను ఎలా పరిష్కరించాలనేది వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ జీఎంలు అన్నపూర్ణ, శ్రీనివాస్, డీజీఎంలు అశోక్ కుమార్, అప్పలరాజు, డీపీడీఎం జీవీఎస్ఎన్ రాజు, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

తీరం.. ఛత్ర శోభితం



సాగర తీరంలో రంగురంగుల గొడుగులతో పర్యాటకులు

ఏయూక్యాంపస్: సముద్ర తీరం కొత్త వర్ణాలను అద్దుకుంది. వర్షం కురిసే వేలలో పదుల సంఖ్యలో పర్యాటకులు సముద్ర తీరంలో కనువిందు చేశారు. చిరుజల్లుల నుంచి తమను రక్షించుకోవడానికి రంగురంగుల గొడుగులు పట్టుకుని తీరంలో ఇలా సందర్శకులు కనిపించారు. ఒకవైపు వర్షం కురుస్తున్నా .. చేతిలో రంగురంగుల గొడుగులు పట్టుకుని చిన్న, పెద్ద సేదతీరారు. ఈ గొడుగులతో సముద్ర తీరం కొత్త వర్ణాన్ని అద్దుకుంది. సందర్శకుల వద్ద పావురాలు అటూ ఇటూ ఎగురుతూ సందడి చేశాయి.